జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శుక్రవారం
23-10-2026

సంపుటి 1 | సంచిక 330

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



5 జిల్లాల్లో కరువుకు కారణం

రేవంత్‌రెడ్డే

బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

గజ్వేల్, దశ: రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో కరువుకు సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతనే కారణమని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో నీళ్లు, కరెంట్ లేక ఎండిపోయిన వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలకు ప్రాణాధార అయిన గోదావరి నుంచి దేవాదుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు 24గంటల పాటు మోటార్లను ప్రభుత్వం ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. శ్రీశైలంలో నీళ్లున్నా అక్కడా 9గంటలే మోటార్లను నడిపిస్తున్నారని విమర్శించారు. మూడేళ్లుగా కాళేశ్వరం 2వ టీఎంసీ పనులను ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అక్కడ పనులు పూర్తి చేస్తే మల్లన్నసాగర్ నిండుకుండలా ఉండేదని, అందుకే ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని విమర్శించారు. కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ. 12వేలు అందించాలని, మరో 20రోజుల పాటు పంటలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, సాగునీటిని అందించి పంటలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బీసీ-ఏలోకి ముదిరాజ్!

అందర్నీ ఒప్పించి మారుస్తాం.. న్యాయ నిపుణులను సంప్రదిస్తాం

వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం

సంక్షేమం నాది, ఎన్నికల బాధ్యత మీది

ఇందిరమ్మ ఇల్లు కట్టని ఊర్లో ఓటడగను

బాబు, వైఎస్, కేసీఆర్ పథకాల్ని సాగిస్తూ

గత ప్రభుత్వాల కన్నా రెట్టింపు సంక్షేమం

కులగణనలో తేడాలుంటే సరిదిద్దుతాం

రాహుల్ ప్రధానైతే బహుజనులు బాగు

పండుగ సాయన్న జయంతి సభలో సీఎం



హైదరాబాద్, దశ: గంగపుత్రులను ఒప్పించి ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతామన్నారు. రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కులగణన లెక్కలు లేనందునే ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏకు ఇప్పటి వరకు మార్చలేక పోయారని తెలిపారు. ఈ అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో అధ్యయనం చేయిస్తానని ప్రకటించారు. ఈ అంశంపై ఇతర కులాలకు ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించే విషయాన్ని ప్రజలు చూసుకోవాలని, అన్ని వర్గాల సంక్షేమాన్ని తాను చూసుకుంటానని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు ఉన్న ఊర్లోనే తాను వచ్చే ఎన్నికల్లో ఓటు అడుగుతానని ప్రకటించారు. ఇల్లులేని పేదల కోసమే తమ సర్కారు 8 లక్షల ఇళ్లనుకట్టిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాల కన్నా రెట్టింపు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని సీఎం ప్రస్తావించారు. ఎన్టీఆర్ రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తే తాము సన్నబియ్యం ఇస్తున్నామని, అదీ ఏకంగా 3.48 కోట్ల మందికి అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్, చంద్రబాబు, వై.ఎస్., కేసీఆర్‌లు ప్రవేశపెట్టిన మంచి పథకాలను ఎటువంటి వివక్ష లేకుండా అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు, రైతు పెట్టుబడి అమలు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని, బీసీ కుల గణన చేపట్టామని తెలిపారు. ఏ కులం వారైనా సరే తమ లెక్క తప్పుగా ఉందని భావిస్తే గణాంకాల్లోకి రానివారి వివరాలు తీసుకువచ్చి ఇవ్వాలని కోరారు. కులగణన లెక్కల్లో తేడాలుంటే వివరాలు ఇవ్వాలని, వాటిని రానున్న కేబినెట్ భేటీలో చర్చించి సరిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని చెప్పారు. ఆ వివరాలను పరిశీలించి జాబితాలో కలుపుతామని, దీనిపై వచ్చే కేబినెట్‌లో చర్చిస్తామని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజులేనని, వారు ఎంతో విశ్వసనీయమైన వారని వ్యాఖ్యానించారు. 1999లో

..మిగతా 4వ పేజీలో ➔




టాలీవుడ్ ఫస్ట్ ఇంటర్నేషనల్ స్టార్‌కు

హ్యాపీ బర్త్‌డే

'ఫస్ట్ ఇంటర్నేషనల్ స్టార్ ఫ్రమ్ టాలీవుడ్' అంటూ జేజేలు అందుకుంటున్నారు ప్రభాస్. అక్టోబర్ 23న ప్రభాస్ బర్త్ డే.. ప్రభాస్ ఫ్యాన్స్‌కు ఆయన పుట్టినరోజు ఓ పర్వదినం. ఈ సందర్భంగా విషెస్ చెబుతూ ప్రభాస్ మూవీ జర్నీని గుర్తు చేసుకుందాం.

'బాహుబలి' (Baahubali) సిరీస్‌లో నటించిన తరువాత ప్రభాస్‌కు ఇంటర్నేషనల్ ఫేమ్ దక్కింది. ఆ తరువాత వచ్చిన ప్రభాస్ మూవీస్ ఎలా ఉన్నా భారీ వసూళ్ళు పోగేయడం మొదలైంది. ఓవర్సీస్‌లో అంతకు ముందు కనీవినీ ఎరుగని రికార్డులను ప్రభాస్ సినిమాలు సొంతం చేసుకోవడం మొదలెట్టాయి. ఈ నేపథ్యంలో

..మిగతా 4వ పేజీలో ➔



ఆరంభం

అదిరింది

తొలి టీ20లో కివీస్‌పై భారత్ విజయం

శాంసన్, ధీర్, శ్రేయస్ మెరుపులు

ఆడేది విదేశీ గడ్డపై. పైగా ప్రత్యర్థి చేసింది 225 పరుగుల భారీ స్కోరు! న్యూజిలాండ్ బౌలర్లను కాచుకుని అంతటి లక్ష్యాన్ని అందుకోవడమంటే తేలిక కాదు. కానీ అదిరే ఆటతో టీమ్‌ఇండియా.. కొండంత లక్ష్యాన్ని కొట్టేసింది. సంజు శాంసన్, నమన్ ధీర్ మన హీరోలు. ఉత్కంఠ మాత్రం తప్పలేదు. శాంసన్ మెరుపులతో ఛేదనలో 5.4 ఓవర్లకు 93/0తో తిరుగులేని స్థితిలో నిలిచిన టీమ్‌ఇండియా.. తడబడి 122/4తో నిలిచింది. ఈ దశలో నమన్ ధీర్, శ్రేయస్ ఒత్తిడికి నిలవడంతో గెలుపు గీత దాటిన భారత్.. సిరీస్‌లో బోణీ కొట్టింది.

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ పర్యటనను భారత్ విజయంతో ఆరంభించింది. ఉత్కంఠభరితంగా సాగిన తొలి టీ20లో శ్రేయస్ సేన 4 వికెట్ల తేడాతో కివీస్‌ను ఓడించి అయిదు టీ20ల సిరీస్‌లో 1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మొదట గ్లెన్ ఫిలిప్స్ (82 నాటౌట్; 40 బంతుల్లో 8×4, 3×6) మెరుపులతో కివీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 225 పరుగులు చేసింది. ఫిన్ అలెన్ (45; 24 బంతుల్లో 5×4, 2×6), బెవోన్ జాకబ్స్ (31; 16 బంతుల్లో 3×6) కూడా రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు శాంసన్ (67; 33 బంతుల్లో 8×4, 4×6) సత్తా చాటడంతో భారత్ 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. నమన్ ధీర్ (42 నాటౌట్; 15 బంతుల్లో 5×4, 2×6), శ్రేయస్ అయ్యర్ (42; 28 బంతుల్లో 1×4, 2×6) విజయంలో కీలకపాత్ర పోషించారు. రెండో టీ20 శనివారం క్రైస్ట్‌చర్చ్‌లోనే జరుగుతుంది. ఆ ముగ్గురు..: భారీ ఛేదనను భారత్ బలంగా మొదలు పెట్టింది. ఫామ్‌లో ఉన్న సంజు

..మిగతా 4వ పేజీలో ➔

అన్నోజిగూడ ఫ్లైఓవర్‌పై కారు దగ్ధం

తృటిలో తప్పించుకున్న నలుగురు..



మేడ్చల్ జిల్లా: అన్నోజిగూడ ఫ్లైఓవర్‌పై ఓ కారు అగ్నిప్రమాదానికి గురైంది. రోడ్డుపై వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగగా.. నలుగురు ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్‌కు చెందిన నలుగురు వ్యక్తులు రెనాల్ట్ పెట్రోల్ కారులో ప్రయాణిస్తున్నారు. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పరిధి అన్నోజిగూడ ఫ్లైఓవర్ పద్దకు చేరుకోగానే వారి కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. మంటలు చెలరేగడాన్ని గుర్తించిన వారంతా వెంటనే కారు నుంచి దిగిపోయారు. దీంతో నలుగురికి పెను ప్రమాదం తప్పింది. బాధితులు వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్లతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది.. తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. మరోవైపు, పోలీసులూ అక్కడికి చేరుకుని పరిశీలించారు. కాగా, కారు మంటల్లో చిక్కుకోవడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సాంకేతిక లోపమా, మరేదైనా కారణమా అనే విషయం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



హమ్మయ్య.. పెద్ద గండం తప్పింది!

పీహెచ్‌పీ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో భద్రతా లోపాలు

70% వెబ్‌సైట్లకు పీహెచ్‌పీనే కీలకం.. గుర్తించిన కృత్రిమ మేధ ఏజెంట్లు

ప్యాచ్ తయారీలో ప్రభుత్వాలు, కంపెనీలు.. పీహెచ్‌పీ ప్యాచ్ విడుదల

వాషింగ్టన్: మానవాళికి ముప్పు కాగలదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో కృత్రిమ మేధ ఓ గొప్ప సాయమే చేసింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 శాతం వెబ్‌సైట్లను నడిపించే కీలక ప్రోగ్రామింగ్ భాష

..మిగతా 4వ పేజీలో ➔

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

సౌదీ ఆరామ్‌కో, విమానాశ్రయంపై హుతీల దాడులు.. ఓ భారతీయుడి మృతి

ఎర్ర సముద్రంలో 14 మంది భారతీయులున్న పడవపై సౌదీ దాడులు!

హోర్ముజ్‌లో 21భారతీయ సిబ్బందితో ఉన్న చమురు ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణులు

నౌకలను తరలించేందుకు ప్రయత్నిస్తే అమెరికా సైనిక స్థావరాలపై దాడులు: ఇరాన్

ఇరాన్‌పై భారీ దాడులకు అమెరికా, ఇజ్రాయెల్ యోచన!

ఇటు హోర్ముజ్‌లో, అటు ఎర్ర సముద్రంలో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు



దుబాయ్/టెల్‌అవీవ్/న్యూఢిల్లీ, అక్టోబరు 22: పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ భేరి మోగుతోంది. చమురు ట్యాంకర్లు, నౌకలపై ఇరాన్ దాడులు చేస్తుండటం, ఇరాన్‌పై మరోసారి భారీ దాడికి దిగాలని అమెరికా, ఇజ్రాయెల్ యోచిస్తున్నట్లుగా వస్తున్న వార్తలతో ఒకవైపు.. సౌదీ ఆరామ్‌కోపై హుతీల దాడులు, సౌదీ, యెమెన్ దళాల దాడులతో మరోవైపు తీవ్ర ఆందోళనకర పరిస్థితి కనిపిస్తోంది. దీంతో చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. ఒక్కో బ్యారెల్ ధర 112డాలర్లకు చేరింది. హోర్ముజ్‌లో, ఎర్ర సముద్రంలో, సౌదీలో జరిగిన దాడుల్లో పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది కూడా ప్రభావితం కావడంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. సౌదీ అరేబియాలోని కీలకమైన ఆరామ్‌కో చమురు కేంద్రం, దమ్మామ్‌లోని కింగ్ ఫాహద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హుతీలు గురువారం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగారు. ఇరు ప్రాంతాల్లోనూ పేలుళ్లు సంభవించి, మంటలు చెలరేగాయి. దమ్మామ్ ఎయిర్‌పోర్టుపై జరిగిన దాడిలో ఒక భారతీయుడు సహా ఇద్దరు మృతిచెందారని, మరో ఇద్దరు భారతీయులు సహా 8మంది గాయపడ్డారని... ఆరామ్‌కో చమురు క్షేత్రంపై దాడిలో ఇంకో భారతీయుడు సహా పలువురు

..మిగతా 4వ పేజీలో ➔

ఆరంభం అదిరింది

మొదటి పేజీ తరువాయి

మెరుపు షాట్లతో స్కోరు పెంచాడు. మిల్నె వేసిన రెండో ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాదిన అతడు.. తర్వాతి ఓవర్లో (ఫెర్గూసన్) 2 ఫోర్లు, సిక్స్ అందుకున్నాడు. ముఖ్యంగా ఓ ఓవర్లో ఫ్లిక్‌షాట్‌తో అతడు కొట్టిన సిక్సర్‌నైతే చూసి తీరాల్సిందే. మరోవైపు అభిషేక్ శర్మ (29; 12 బంతుల్లో 2×4, 3×6) కూడా ధాటిగా ఆడాడు. మిల్నె వేసిన నాలుగో ఓవర్లో ఈ ఓపెనర్, వరుసగా రెండు సిక్స్‌లు బాదాడు. పవర్ ప్లే ఆఖరి ఓవర్లో అభిషేక్‌ను ఔట్ చేసి కివీస్‌కు బ్రాస్‌వెల్ బ్రేక్ ఇచ్చాడు. కానీ జోరు కొనసాగించిన సంజు.. 23 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. 8.5 ఓవర్లకు 115/1తో భారత్ మెరుగైన స్థితిలో నిలిచింది. ఈ స్థితిలో టీమ్‌ఇండియా అనూహ్యంగా కుదుపునకు లోనైంది. 7 పరుగుల తేడాతో 3 వికెట్లు కోల్పోయి 122/4తో ఇబ్బందుల్లో పడింది. కుదురుకున్న సంజుతో పాటు తిలక్ వర్మ (6), ఇషాన్ కిషన్ (1) పెవిలియన్ చేరిపోయారు. ఈ దశలో శ్రేయస్, అక్షర్ (24; 14 బంతుల్లో 3×4, 1×6) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. అక్షర్‌ను ఔట్ చేసిన ఫెర్గూసన్.. ఈ జోడీని విడగొట్టాడు. సమీకరణం 30 బంతుల్లో 55 పరుగులుగా ఉన్న స్థితిలో.. శ్రేయస్, నమన్ ధీర్ జంట ఒత్తిడికి నిలిచింది. శాంట్నర్ వేసిన 17వ ఓవర్లో ధీర్ 6, 4.. శ్రేయస్ ఓ ఫోర్ అందుకోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ నియంత్రణలోకి వచ్చింది. 12 బంతుల్లో 16 పరుగులు అవసరమైన స్థితిలో 19వ ఓవర్లో శ్రేయస్ ఔటైనా.. ధీర్ తగ్గలేదు. దీంతో హెన్రీ వేసిన ఆఖరి ఓవర్లో 8 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతినే బౌండరీకి పంపిన ధీర్.. నాలుగో బంతిని స్టాండ్స్‌లోకి కొట్టి రెండు బంతులు మిగిలుండగానే భారత్‌కు విజయాన్ని అందించాడు. బ్రాస్‌వెల్, శాంట్నర్ రెండేసి వికెట్లు తీశారు.

ఫిల్స్ దంచేశాడు: మొదట కివీస్ ఇన్నింగ్స్‌లో ఫిల్స్ ఆటే హైలైట్. ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన అతడు.. జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. మొదట ఓపెనర్లు సీఫర్ట్, అలెన్ గట్టి పునాది వేస్తే.. ఫిల్స్ మెరుపు ముగింపునిచ్చాడు. ఆరంభంలో సీఫర్ట్, అలెన్ దూకుడుగా ఆడారు. నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న భువనేశ్వర్ కుమార్ (0/49).. తొలి ఓవర్లో పొదుపుగా బంతులు వేసి 4 పరుగులే ఇచ్చాడు. కానీ తన రెండో ఓవర్లో మాత్రం సీఫర్ట్ ధాటికి అతడు రెండు ఫోర్లు, ఓ సిక్స్ సమర్పించుకున్నాడు. సీఫర్ట్‌ను మయాంక్ ఔట్ చేసినా.. కివీస్ పరుగుల జోరు కొనసాగింది. 7 ఓవర్లకు 72/1తో కివీస్ భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. అలెన్ ఔటైనా.. ఫిలిప్స్, డరిల్ మిచెల్ (28; 19 బంతుల్లో 2×4, 1×6) దూకుడు కొనసాగించారు. ఆ తర్వాత జాకబ్స్ జతగా ఫిలిప్స్ పరుగుల వేట సాగించాడు. అదే క్రమంలో ఫిలిప్స్ 27 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. ఉన్నంతసేపు ధాటిగా ఆడిన జాకబ్స్ ఔటైనా.. ఫిలిప్స్ కివీస్ స్కోరును 200 దాటించాడు.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ (సి) శాంసన్ (బి) మయాంక్ 24; అలెన్ (సి) తిలక్ (బి) అక్షర్ 45; మిచెల్ (సి) భువనేశ్వర్ (బి) అర్ష్‌దీప్ 28; ఫిలిప్స్ నాటౌట్ 82; జాకబ్స్ రనౌట్ 31; మైకేల్ బ్రాస్‌వెల్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 225; వికెట్ల పతనం: 149, 280, 3122, 4195; బౌలింగ్: భువనేశ్వర్ 40490; అర్ష్‌దీప్ 40451; మయాంక్ యాదవ్ 40401; అక్షర్ పటేల్ 40511; నితీశ్ 40400

భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (బి) శాంట్నర్ 67; అభిషేక్ (సి) మిల్నె (బి) బ్రాస్‌వెల్ 29; తిలక్ (సి) ఫెర్గూసన్ (బి) బ్రాస్‌వెల్ 6; శ్రేయస్ (సి) శాంట్నర్ (బి) మిల్నె 42; ఇషాన్ కిషన్ (సి) అలెన్ (బి) శాంట్నర్ 1; అక్షర్ (సి) కాన్వే (బి) ఫెర్గూసన్ 24; నమన్ ధీర్ నాటౌట్ 42; నితీశ్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 17 మొత్తం: (19.4 ఓవర్లలో 6 వికెట్లకు) 230; వికెట్ల పతనం: 193, 2115, 3117, 4122, 5167, 6210; బౌలింగ్: హెన్రీ 3.40570; మిల్నె 30431; ఫెర్గూసన్ 30341; మైకేల్ బ్రాస్‌వెల్ 40372; శాంట్నర్ 40392; నాథన్ స్మిత్ 20200



226

టీ20ల్లో భారత్‌కు ఇదే అత్యధిక ఛేదన. 2026 జనవరిలో కివీస్‌పై, 2023లో ఆస్ట్రేలియాపై 209 పరుగులు ఛేదించడమే ఈ ఫార్మాట్‌లో ఇప్పటిదాకా టీమ్‌ఇండియాకు అత్యధికం.

టాలీవుడ్ ఫస్ట్ ఇంటర్నేషనల్ స్టార్‌కు హ్యాపీ బర్త్‌డే

మొదటి పేజీ తరువాయి

'ఫస్ట్ ఇంటర్నేషనల్ స్టార్ ఆఫ్ ఇండియా' (First International Star of India) అని కొందరు కీర్తించారు. అయితే మరికొందరు టాలీవుడ్ నుండి ఇంటర్నేషనల్ స్టార్‌గా ఎదిగిన తొలి హీరో అని ప్రశంసించారు. ఎవరు ఏమనుకున్నా, ఇప్పటికీ తొలి సినిమా 'ఈశ్వర్' నాటి ప్రభాస్ లాగే అందరినీ నవ్వుతూ 'డార్లింగ్' అంటూ సంబోధిస్తూ సరదాగా సాగుతున్నారు ప్రభాస్. ఆయన పుట్టినరోజయిన అక్టోబర్ 23న అభిమానులు పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. తన ఫ్యాన్స్ జీవితంలో ఏదో ఒకటి సాధించాలని ప్రభాస్ ఆశిస్తూంటారు. వారితోనూ అదే చెబుతూంటారు. ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాలతో పాటు.. 'సలార్, కల్కి 2898 ఏడి' సినిమాల సీక్వెల్స్ లోనూ నటించాల్సి ఉంది. ఈ సినిమాలతో పాటు మరికొన్ని భారీ ప్రాజెక్ట్స్ సైతం ప్రభాస్ కోసం ఎదురుచూస్తున్నాయి. టాలీవుడ్‌లో ఇంత బిజీగా సాగుతున్న స్టార్ హీరో మరొకరు కానరారు. ఈ ఏడాది ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్' సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అభిమానులు నిరాశకు గురయ్యారు. అయినప్పటికీ తమ హీరో రాబోయే సినిమాలతో మరింతగా మురిపిస్తారని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఈ సారి అక్టోబర్ 23తో ప్రభాస్‌కు 47 ఏళ్ళు పూర్తవుతున్నాయి. ఈ పుట్టినరోజు తరువాత ప్రభాస్‌కు అంతా మంచే జరుగుతుందని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆయన పెళ్లి కబురు కోసం ఫ్యాన్స్ ఎంతగానో వేచి చూస్తున్నారు. ప్రభాస్ సైతం ఫ్యాన్స్‌కు ఆనందం పంచడానికి బర్త్ డేన ఆయన నటించిన కొత్త సినిమాల లుక్స్, టీజర్స్‌తో అలరించే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేతినిండా సినిమాలు ఉన్నాయి. వచ్చే యేడాది నుంచి ఒకే సమయంలో సమాంతరంగా రెండు సినిమాల్లో నటించాలని ప్రభాస్ ప్లాన్ రూపొందించుకున్నారు. ఆ తీరున ఇకపై ఏడాదికి రెండు చిత్రాలతో అభిమానులకు ఆనందం పంచనున్నారు ప్రభాస్. ఈ యేడాది చివరలో 'ఫౌజీ' వెలుగు చూస్తుందని ఆశించారు. అయితే ఆ సినిమా ఆలస్యం కానుందని తెలుస్తోంది. అలాగే 'స్పిరిట్' కూడా మరింత వెనక్కి జరిగేలా కనిపిస్తోంది. ఈ రెండు సినిమాలు వచ్చే సంవత్సరం తప్పకుండా ప్రేక్షకులను పలకరిస్తాయని తెలుస్తోంది. ఆ తరువాత మరింత స్పీడు పెంచి అటుపై ఏడాదికి మూడు సినిమాలనైనా రిలీజ్ చేసే ప్రయత్నంలో ఉన్నారు ప్రభాస్. మరి రాబోయే సినిమాలతో ప్రభాస్ ఏ తీరున మురిపిస్తారో చూడాలి. ప్రభాస్‌కు మరిన్ని సక్సెస్‌లు రావాలని కోరుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేద్దాం. హ్యాపీ బర్త్‌డే ప్రభాస్ (Happy Birthday Prabhas).

ప్రభాస్ ప్రభంజనం.. బాక్సాఫీస్ దగ్గర ఆయన మాయాజాలం ఎప్పటికీ ప్రత్యేకమే

భారతీయ సినిమా ఇప్పటికే ఎంతోమంది తారల్ని... బాక్సాఫీస్ దగ్గర వాళ్లదైన సత్తానీ చూసింది, ఇకపైనా చూస్తుంది. కానీ, అందులో ప్రభాస్ అందుకున్న స్టార్ ఇమేజ్... బాక్సాఫీస్ దగ్గర ఆయన మాయాజాలం ఎప్పటికీ ప్రత్యేకమే! అంతర్జాతీయ స్థాయిలో ఇప్పుడు ప్రభాస్‌ని చూడగానే తెలుగు సినిమా గుర్తొస్తుంది. అంతే కాదు... తెలుగు సినిమా కేంద్రంగానే నటిస్తూ..గ్లోబల్ స్టాయినీ ప్రభావితం చేస్తున్నారు.

పాన్ ఇండియా సినిమాలతో ప్రభంజనాన్ని సృష్టించి... ఆ మార్కెట్‌కి రాచబాట పడటంలో కీలక పాత్ర పోషించారు ప్రభాస్. ఆయన ప్రస్థానం మొదలై 24 ఏళ్లయింది. ఈ ప్రయాణంలో ఆయన సినిమాలు సాధించిన వసూళ్ల రికార్డులు ఎన్నెన్నో! 'వర్షం', 'ఛత్రపతి', 'చక్రం', 'బుజ్జిగాడు', 'బిల్లా', 'ఏక్ నిరంజన్', 'డార్లింగ్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'మిర్చి'.... ఇలా ఒకొక్క సినిమాతో నటుడిగా తనని తాను ఉన్నతంగా మలుచుకుంటూనే, బాక్సాఫీస్‌పై ఆధిపత్యం ప్రదర్శించారు. ఇక 'బాహుబలి' చిత్రాల నుంచి ఆయనది మరో కొత్త అధ్యాయం. దక్షిణాది, ఉత్తరాది అంటూ భాషల మధ్య, చిత్ర పరిశ్రమల మధ్య హద్దులు చెరిగిపోయాయి. భారతీయ సినిమా పరిశ్రమలన్నిటినీ ఏకం చేసేశాయి ప్రభాస్ సినిమాలు. బాలీవుడ్ హీరోల్ని సైతం మించిపోయేంతగా ఆయన ఉత్తరాదిలోనూ అభిమాన గణాన్ని సొంతం చేసుకొన్నారు. ప్రభాస్ సినిమా వస్తోందంటే చాలు అమెరికా నుంచి జపాన్ వరకూ ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఆ సందడి కనిపిస్తుంటుంది. అదీ ప్రభాస్ సృష్టించిన ప్రభంజనం అంటే!

ఎంత ఎత్తుకు ఎదిగినా...

స్టార్‌గా ఎంత ఎత్తుకు ఎదిగినా ప్రభాస్ ఇప్పటికీ ఒదిగే ఉంటారు. తన వ్యక్తిత్వంలో ఎలాంటి మార్పూ కనిపించదు. హాయ్ డార్లింగ్స్... అంటూ ఎప్పట్లాగే అందరినీ ఆప్యాయంగా పలకరిస్తుంటారు. ఆయనతో కలిసి పనిచేసిన నటీనటులు, సాంకేతిక బృందమైతే ప్రభాస్ మంచితనం గురించి, ఆయన ఆతిథ్యం గురించి కథలు కథలుగా చెప్పుకుంటుంటారు. ఆతిథ్యం ఇవ్వడాన్ని ఎంతో ఇష్టపడే ప్రభాస్ ఇచ్చిన విందు, ఆయన రుచి చూపించిన వంటకాల గురించి ఎవరో ఒకరు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూనే ఉంటారు.

మరింత వేగంతో...

ఏడాదికి రెండు సినిమాలతోనైనా ప్రేక్షకుల్ని పలకరించాలనేది తన లక్ష్యం అని చెబుతుంటారు ప్రభాస్. అందుకే ఆయన వెంట వెంటనే సినిమాలకు పచ్చజెండా ఊపుతూ, వేగంగా పనిచేయడంపై దృష్టి పెడుతున్నారు.

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

మొదటి పేజీ తరువాయి

గాయపడ్డారని సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఎర్ర సముద్రంలో 14 మంది భారతీయులు ప్రయాణిస్తున్న పడవపై సౌదీ అరేబియా దాడి చేసిందని హుతీలు గురువారం ప్రకటించారు. జుఖర్ దీవి సమీపంలో భారతీయులున్న పడవపై సౌదీ దాడి చేసిందని, యెమెన్ నౌకాదళం వారందరినీ రక్షించిందని హుతీల ప్రతినిధి యహ్యా సరీ తెలిపారు. అయితే ఈ విషయాన్ని సౌదీగానీ, భారత్ గానీ ధ్రువీకరించలేదు. కాగా, సౌదీ దమ్మామ్ ఎయిర్‌పోర్టుపై హుతీల దాడులను భారత విదేశాంగ శాఖ ఖండించింది. పౌర, ఇంధన మౌలిక వసతులపై దాడులు సరికాదని పేర్కొంది.

7చమురు నౌకలను దెబ్బతీశాం: ఇరాన్

తాము చేసిన దాడుల్లో, సముద్రపు మందుపాతరల (సీమైన్స్)ను ఢీకొని 7 చమురు ట్యాంకర్లు దెబ్బతిన్నట్టు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీసీ) గురువారం ప్రకటించింది. గల్ఫ్‌లో నాలుగు చమురు నౌకలపై తమ నావికాదళం దాడి చేసిందని.. హోర్ముజ్‌లో సీమైన్లను ఢీకొని మూడు చమురు ట్యాంకర్లకు మంటలు అంటుకున్నాయని పేర్కొంది. అమెరికా ఇలాగే చమురు నౌకలను హోర్ముజ్ దాటించడానికి ప్రయత్నిస్తుంటే.. పశ్చిమాసియాలోని ఆ దేశ సైనిక స్థావరాలపై దాడులకు దిగుతామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. హోర్ముజ్‌లో ఒమన్ తీరానికి సమీపంలో కువైట్ జెండాతో ప్రయాణిస్తున్న అల్ దస్మా చమురు ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఆ నౌకలో 21 మంది భారతీయులు సహా 40 మంది వరకు సిబ్బంది ఉన్నట్టు గుర్తించారు. అయితే ఈ దాడిలో ప్రాణనష్టమేదీ జరగలేదు.



ఇరాన్‌పై మళ్లీ భారీ దాడులకు యోచన!

త్వరలో ఇజ్రాయెల్‌లో సాధారణ ఎన్నికలు, అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఇజ్రాయెల్‌లో ఎన్నికలు నెతన్యాహుకు, అమెరికాలో ఎన్నికలు ట్రంప్‌కు కీలకంగా మారాయి. ఈ క్రమంలో ప్రజల్లో మద్దతు పెంచుకునేందుకు వారు ఇరాన్‌పై మరోసారి భారీ స్థాయిలో దాడులకు దిగవచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి.

112 డాలర్లకు చేరిన చమురు..

ఇరాన్‌పై అమెరికా దాడులతో హోర్ముజ్‌లో రవాణా నిలిచిపోవడం, ఇటు ఎర్రసముద్రంలో సమస్యలతో అంతర్జాతీయంగా చమురు రవాణాపై ప్రభావం పడింది. చమురు ధరలు ఎగిసిపడుతున్నాయి. గురువారం ఏకంగా బ్యారెల్‌కు 112 డాలర్లకు చేరాయి. మరోవైపు, హుతీలు ఇటీవల సౌదీలోని కీలక విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలపై దాడులు మొదలుపెట్టారు. కీలకమైన బాబ్ అల్ మందేబ్ జలసంధిపై పట్టు సాధించారు. దీనివల్ల కూడా చమురు ధలు పెరుగుతున్నాయి.

బీసీ-ఏలోకి ముదిరాజ్!

మొదటి పేజీ తరువాయి

తాను తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ పడినపుడు ముదిరాజులే అండగా నిలిచారని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. తాను పీసీసీ అధ్యక్షుడిని కాగానే శ్రీహరి ముదిరాజ్‌ను డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించానని, ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో పాటు, మంత్రి పదవి కూడా కల్పించామని, ముదిరాజ్ బిడ్డ నీలం మధుకు సైతం ఎంపీ టికెట్ ఇచ్చామని ప్రస్తావించారు. ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. సన్న వండ్లు పండించాలన రైతులకు చెబితే కొందరు అవహేళన చేశారని, ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు అమాంతంగా పెరిగిపోయాయని, ఇది రైతులకు ప్రయోజనం కలిగించే అంశమని చెప్పారు. బహుజనుల జీవితాలు బాగుపడాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు. రాహుల్‌కు అండగా నిలవాలని ముదిరాజ్‌లను కోరారు. సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. భూస్వాములు తన భూమిని ఆక్రమించుకున్నపుడు పండుగ సాయన్న ఎదురు తిరిగారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పండుగ సాయన్నను నిజాం పోలీసులు అరెస్టు చేస్తే నాటి వనపర్తి మహారాణి పెద్ద ఎత్తున నిధులు చెల్లించి సాయన్నను విడిపించారని తెలిపారు. ట్యాంక్ బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్యల విగ్రహాలను ఆవిష్కరిస్తామన్నారు.

హమ్మయ్య.. పెద్ద గండం తప్పింది!

మొదటి పేజీ తరువాయి

పీహెచ్‌పీలోని భద్రతలోపాలను గుర్తించింది. దీంతో అటు ప్రభుత్వాలు, ఇటు ఐటీ కంపెనీలు ఈ లోపాలను సరిదిద్దే సాఫ్ట్‌వేర్ (ప్యాచ్) తయారీకి పరుగులు పెడుతున్నాయి. చాలావరకూ ప్రభుత్వ వెబ్‌సైట్లు గురువారం మామూలుగానే పనిచేశాయి కానీ.. ప్యాచ్‌ను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో కొన్ని రకాల నెట్ సేవలకు అంతరాయం కలిగినట్లు సమాచారం. పీహెచ్‌పీ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లోని భద్రతా లోపాలపై అమెరికా సంస్థ ఎఫ్‌బీఐ మొట్టమొదట బుధవారం హెచ్చరికలు జారీ చేసింది. ఈ లోపాల సాయంతో హ్యాకర్లు పీహెచ్‌పీ ఆధారంగా పనిచేసే సిస్టమ్స్‌లోకి దూరం నుంచే కోడ్‌ను ప్రవేశపెట్టి రన్ చేయగలరని తెలిసింది. దీనివల్ల సున్నితమైన డేటాతోపాటు నెట్‌వర్క్ వ్యవస్థలు సైతం ముప్పును ఎదుర్కొవాల్సి రావచ్చు. లోపాలను సరిదిద్దే ప్యాచ్‌ను వెంటనే సిద్ధం చేయడం వీలు కాని నేపథ్యంలో వెబ్‌సైట్లను తాత్కాలికంగా ఆఫ్‌లైన్ మోడ్‌లో ఉంచాలని ఎఫ్‌బీఐ సూచించింది. ఇదిలా ఉంటే పీహెచ్‌పీ భద్రత లోపాలకు సంబంధించి ప్యాచ్‌ను అభివృద్ధి చేస్తున్నందున బ్రిటన్‌లో కొన్ని ప్రభుత్వ సేవలు తాత్కాలికంగా నిలిపేయవచ్చునని ఆ దేశ ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ఓపెన్ ఏఐ వంటి సంస్థలతో కలిసి పరిష్కార మార్గాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపింది.

ఫిన్లాండ్, జపాన్‌లు ఇప్పటికే ప్యాచ్‌ను విడుదల చేసి అందరూ ఇన్‌స్టాల్ చేసుకోవాలని ప్రకటించాయి. ఒకవేళ ప్యాచ్‌ను ఇన్‌స్టాల్ చేయడం కష్టమైతే వెబ్‌సైట్లను తాత్కాలికంగా నిలిపివేసే అంశాన్ని ఆయా దేశాలు పరిశీలిస్తున్నాయి. మరోవైపు క్లౌడ్‌ఫ్లేర్ సీఈవో మాథ్యూ ప్రిన్స్ సోషల్ మీడియాలో ఒక పోస్టు చేస్తూ పీహెచ్‌పీలోని లోపాల గురించి తెలిసిన వెంటనే దాన్ని దుర్వినియోగం చేసేందుకు లక్షల ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. పీహెచ్‌పీ ఫౌండేషన్ కూడా భద్రత లోపాలను సరిదిద్దే ప్యాచ్‌ను బుధవారం రాత్రే విడుదల చేయడంతోపాటు, అప్‌డేషన్‌కు సంబంధించిన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది.

కృత్రిమ మేధ పాత్ర...

పీహెచ్‌పీలోని భద్రత లోపాలను గుర్తించడంలో కృత్రిమ మేధస్సు ఏజెంట్లు కీలక పాత్ర పోషించాయి. రెండు నెలలుగా తమ ఏఐ ఏజెంట్లు ఈ లోపాలను గుర్తించేందుకు, పరిష్కార మార్గాలను సిద్ధం చేసేందుకు పనిచేశాయని ఓపెన్‌ఏఐ తన బ్లాగ్‌లో వివరించింది. ఈ పనిలో ఐటీ నిపుణులతోపాటు భద్రతా సంస్థలు ఇతర భాగస్వాములు కూడా పాలుపంచుకున్నట్లు తెలిపింది. మరోవైపు యూరోపియన్ యూనియన్ సైబర్ భద్రత సంస్థ ఎనిసా కూడా కంపెనీలు ఈ లోపాల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించింది.



చి'వరి' ప్రయత్నం..

ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి..

షాబాద్(రంగారెడ్డి): ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో ఎండుముఖం పడుతున్న పంటకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పోస్తున్నారు. షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన రైతులు గుత్తి రాజు, శివయ్యలు రోజుకు 10 ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి వరి పొలానికి పెడుతున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ. 1000 చొప్పున ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

డిండికి నీటిపై రచ్చ వద్దు

ఉత్తమ్‌తో మండలి చైర్మన్ గుత్తా, జానారెడ్డి, జూపల్లి, పాలమూరు జిల్లా ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్, అక్టోబరు 22: డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని ఎక్కడి నుంచి తరలించాలన్న అంశంపై కాంగ్రెస్ నేతలు ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవాలన్న ప్రతిపాదనను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఏదుల నుంచే డిండికి నీరు ఇవ్వాలని నల్లగొండ జిల్లా నేతలు కోరుతున్నారు. దీనిపై వివాదం నెలకొన్న నేపథ్యంలో రెండు జిల్లాల నేతలు గురువారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. వీరిలో పాలమూరు జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, నల్లగొండ జిల్లాకు చెందిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, కొందరు ఎమ్మెలేలు ఉన్నారు. ఏదుల నుంచి డిండికి నీటిని తరలించే అంశంపై సుమారు గంటన్నరపాటు చర్చించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com